క్లుప్తంగా

30న భక్తిగీతాల ఆలాపన

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో ఈనెల 30న(ఆదివారం) 108 భక్తిగీతాల ఆలాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో భక్తిగీతాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య, చిత్తూరు,తిరుపతి జిల్లాలకు చెందిన గాయనీ,గాయకులు, భక్తులు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు. భక్తిపాటలు పాడాలనుకునే కళాకారులు 9618489171ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళా సంస్థ గౌరవ అధ్యక్షులు గంగిరెడ్డి, కళావాహిని వ్యవస్థాపకులు వేమనారాయణ, శ్రీరామసేవా ట్రస్టు అధ్యక్షులు రాఘవన్, సహ కార్యదర్శి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ప్రసాద్ హాస్పిటల్‌లో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సదాశివరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేష్ గుప్తా, ట్రెజరర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, సభ్యులు సుధాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, బాలాజి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రమణ మృతి తీరని లోటు

మదనపల్లె సిటీ: ప్రముఖ కళాకారుడు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జీవీ రమణ మృతి తీరని లోటని ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన మృతికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ కళాకారుడిగా మదనపల్లెకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారని గుర్తు తెచ్చారు. అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంలో తన వంతు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. రమణ మృతిపై మరసం సంతాపం ప్రకటించారు.

అంతర్జాతీయ త్రోబాల్ సదస్సుకు బాలాజీ



మదనపల్లె సిటీ: ఇటలీలోని జెనోవా మెట్రోపాలిటిన్ కాన్ఫరెన్సులో జరగనున్న అంతర్జాతీయ త్రోబాల్ క్రీడా సదస్సుకు కురబలకోట జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ బి.బాలాజీ హాజరుకానున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. ఈనెల 21న ఇటలీకి బయలుదేరనున్నట్లు తెలిపారు. 22 నుంచి 25 వరకు జరిగే సదస్సులో పాల్గొంటారన్నారు. బాలాజీ అంతర్జాతీయ త్రోబాల్ ఫెడరేషన్ అంతర్జాతీయ రెఫరీగా, నేషనల్ త్రోబాల్ ఫెడరేషన్ రెఫరీ, టెక్నికల్ రెఫరీగా వ్యవహరించారన్నారు. ప్రస్తుతం ఏపీ త్రోబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా ఉన్నారన్నారు. అంతర్జాతీయ సదస్సులో త్రోబాల్ ఆట నిబంధనలు, ఆట నైపుణ్యాలు, ఆట వల్ల కలిగే ఆరోగ్యం, యూరఫ్ ఖండంలో త్రోబాల్ ఆట అభివృద్ధి అనే అంశాలపై సదస్సుల్లో చర్చించడం జరుగుతుందన్నారు. భారతదేశం నుంచి 8 మంది ఎంపికకాగా అందులో ఆంధ్ర నుంచి ఒక్కరు మాత్రమే ఎంపిక చేశారన్నారు. బాలజీని సహచర పీడీలు అభినందించారు.

రంజాన్ తోఫా అందజేత



రంజాన్‌తోఫా పంపిణీ చేస్తున్న అల్ మదద్ ట్రస్టు సభ్యులు

వాల్మీకిపురం: ధర్మం, దానం, క్రమశిక్షణ నేర్పే పర్వదినం రంజాన్ పండుగ అని అల్ మదద్ ట్రస్టు అధ్యక్షులు నయీముద్దీన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నాయక్‌వీధి దర్గా ప్రాంగణంలో ముస్లిం నిరుపేదలకు నిత్యవసర వస్తువులు, బియ్యం తదితర వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ తోఫా పేరుతో నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పేద ముస్లిం కుటుంబాలకు సహాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు అమీర్ హుస్సేన్, నసీముల్లా సాహెబ్, సందాని, ఖలందర్, తాహీర్, కిజర్, షఫి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రామసముద్రం: స్థానిక దినసరి మార్కెట్ వద్ద ఆదివారం బస్సును మరమ్మతుల కోసం నిలిపారు. పక్కన ఉన్న చెత్త దిబ్బలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికంగా ఉండటంతో ఆగి ఉన్న బస్సుకు మంటలు ఎగిసిపడటంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే నీటి బిందెలతో మంటలను అదుపు చేశారు.

‘జగనన్నే మా భవిష్యత్తుకు’ ఇంటింటా ఆదరణ



వాల్మీకిపురం: ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న నాయకులు



పీలేరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

వాల్మీకిపురం: జగనన్నే మా భవిష్యత్తుకు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఇంటింటికి వెళుతున్న వైఎస్సార్ సీపీ నేతలకు అడుగడుగునా ఆదరణ లభిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీ చిన్నగంగువారిపల్లిలో మండల సచివాలయ కన్వీనర్ రాయుడు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదవర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, రాబోయే ఎన్నికల్లో పేదవర్గాలు జగన్‌కు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద, సురేంద్ర రెడ్డి, నరసింహా రెడ్డి, ఓబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ ఆదరణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు బాబు, ఫుజేల్, సయ్యద్‌బాషా, నారాయణ, వెంకటేష్ తదితరులు మండల కేంద్రంలో పర్యటించారు. జగనన్న పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను లబ్దిదారుల ఇళ్ళకు అతికించారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గడప గడపకూ తీసుకెళ్తున్నారు. ఆదివారం మండలంలోని గట్టు, నాయనబావి గ్రామపంచాయతీల పరిధిలో ఇంటింటికి వెళ్లి కుటుంబాలను కలిసి వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధి, పథకాలను వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమాల్లో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నేరేళ్ల రెడ్డిహరి, సర్పంచులు జయరామిరెడ్డి, ఉమామహేశ్వరీ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, స్కూల్ కమిటి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మురళీరెడ్డి, బయ్యారెడ్డి, ఉమాశంకర్, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

పీలేరు : అన్ని వర్గాలు అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని కావలిపల్లె, కోటపల్లె తదితర ప్రాంతాల్లో విస్తృతంగా జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం చేపట్టారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లావణ్య నరేష్, నాగార్జున, గోవర్దన్‌రెడ్డి, బావాజీ పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి: మండలంలోని మహల్‌లో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిధిలోని కొత్తపేట వీధి ప్రాంతంలో ఎంపీపీ నూర్జహాన్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే మండలంలోని పల్లవోలు, పత్తేగడ, గుండ్లూరు, మేడికుర్తి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, మహల్, అద్దవారిపల్లి సర్పంచ్‌లు రియాజ్‌తస్లీమా, గంగయ్య, కలికిరి ఉప సర్పంచ్ నూరిన్నీషా, ఫయాజ్, బావాజీ, సయ్యద్ బాషా, షాహీర్, కేఎంఆర్ బావాజాన్, ఉనాయతుల్లా, ఖాదర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

కలకడ : ముఖ్యమంత్రి జగనన్నతోనే మన అందరి భవిషత్ అని సింగిల్‌విండో అధ్యక్షుడు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఇర్రివాండ్లపల్లె, ఆర్వింటిదిన్నె, ఆరుమడకవారిపల్లె గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, ప్రకాష్‌రెడ్డి, ఆర్‌వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

గుర్రంకొండ: రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడు వరదారెడ్డి నారదరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని టి.రాచపల్లె పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయల కన్వీనర్లతో కలసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, నాయకులు ఎల్లారెడ్డి, పాల్గొన్నారు.

కేవీపల్లె : మండలంలోని వగళ్ల, నూతనకాల్వలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొన్ని వర్గాలకు, కొంత మందికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని తెలిపారు. అదే ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్రప్రభుత్వంలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య, నాయకులు రామకొండారెడ్డి, ఖాదర్‌బాషా, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక స్థితిగతులు మారాయి

తంబళ్లపల్లె: జగనన్న పాలనలో ప్రతి కుటుంబంలోనూ ఆర్థిక స్థితిగతులు మారి ఆనందంగా ఉన్నామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఆదివారం కన్నెమడుగు పంచాయతీలో సర్పంచు శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్, మల్లయ్యకొండ చైర్మన్ మల్లిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన తీరు వివరిస్తూ వారి అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు రామశంకర్‌రెడ్డి, మద్దిరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, షాదిక్, సలీమ్, బీసీ నాయకులు రామూర్తిల ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాలన, ప్రజలకు చేరిన లబ్ధిని వివరించారు.









పెద్దతిప్పసముద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ, బి.కొత్తకోట : ఇంటింటా ప్రచారంలో నాయకులు, మహల్‌లో ప్రచారం చేస్తున్న రాష్ట్ర మైనార్టి కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, తంబళ్లపల్లె : కన్నెమడుగులో..

ఇళ్ల పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం

పీలేరు : పీలేరులో ఇళ్ల పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నేడు (సోమవారం) పీలేరుకు రానున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏపీఐఐసీ లేఅవుట్ వద్ద ఇళ్ల పట్టాల పంపిణీ సభా ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు స్థానిక తిరుపతిరోడ్డు మార్గంలో షాదీమహల్ నిర్మాణానికి భూమిపూజ, 7.30 గంటలకు మూడో విడత ఇళ్ల పట్టాల పంపిణీ, అనంతరం గూడరేవుపల్లెలో గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం ఉంటాయన్నారు. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక అక్షా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాల పంపిణీ సభా ప్రాంగణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

ఘనంగా చెన్నకేశవస్వామి జాతర

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం వేంపల్లెలో చెన్నకేశవస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామికి అభిషేకాలు,పూజలు నిర్వహించారు. ఉత్సవానికి ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా హాజరయ్యారు. స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేకి శాలువ కప్పి సన్మానించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

చిన్నారి మృతికి వ్యాక్సిన్ కారణం కాదు

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

కేవీపల్లె : మండలంలోని లక్ష్మీరెడ్డిగారిపల్లెలో రెండు నెలల మగబిడ్డ వ్యాక్సిన్ కారణంగా మృతి చెందినట్లు గ్రామంలో వదంతులు వచ్చాయని, అయితే చిన్నారి మృతికి వ్యాక్సిన్ కారణం కాదని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. ఆదివారం గర్నిమిట్ట పీహెచ్‌సీలో వ్యాక్సిన్ల భద్రపరుస్తున్న విధానం, రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటీన్ ఇమ్యునైజేషన్ సెషన్‌లో భాగంగా శనివారం లక్ష్మీరెడ్డిగారిపల్లెల్లో ఆరోగ్య సిబ్బంది వ్యాక్సినేషన్ నిర్వహించారని తెలిపారు. వ్యాక్సినేషన్ వేసిన రెండు నెలల చిన్నారికి రాత్రి వరకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కలగలేదన్నారు. ఆదివారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న బిడ్డను చికిత్సనిమిత్తం తల్లిదండ్రులు పీలేరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ బిడ్డ మృతి చెందినట్లు నిర్ధారించారని తెలిపారు. బిడ్డ మృతికి మిల్క్ ఆస్పిరేషన్ కారణం ఉండవచ్చునని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సామాజిక ఆరోగ్య అధికారి నారాయణ, డాక్టర్ శ్యామల, ఆరోగ్య సిబ్బంది భాగ్యలక్ష్మీ, రమాదేవి, కృష్ణయ్య, కృష్ణమ్మ, పురుషోత్తం, మెమిన్‌తాజ్, రమణి, రహీనబేగం, సరస్వతి, గీతారాణి పాల్గొన్నారు.



వ్యాక్సిన్ల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కలికిరి: ఏపీఎంజేపీ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 110 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఉదయమాణిక్యం, ఐతేపల్లి, సదుం, తంబళ్ళపల్లి, సత్యవేడు, పీలేరు, పెద్దపంజాణి, కలికిరి పరీక్షా కేంద్రాల్లో మొత్తం 805 మందికి గాను 695 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామని, ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు చెప్పారు.



కలికిరి పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

ప్రకృతి మామిడికి మంచి డిమాండ్

– జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు

కేవీపల్లె : ప్రకృతి సాగు పద్ధతిలో దిగుబడినిచ్చే మామిడికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు అన్నారు. మండలంలోని నూతకాల్వలో రైతు శివకుమార్ 15 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మామిడి సాగు చేశాడు. అంతేగాక నాణ్యమైన పంటదిగుబడికి మామిడి కాయలకు కవర్లతో తొడుగులు ఏర్పాటు చేశారు. ఆదివారం మామిడి తోటను జిల్లా ఉద్యాన శాఖ అధికారి తోపాటు మామిడిపండ్ల ఎగుమతి దారు పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతు శివకుమార్ మామిడి సాగు చేయడం అభినందనీయమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో అవలంభిస్తున్న పద్ధతులు, కవర్లు తొడిగిన విధానం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. రసాయన రహిత మామిడి పండ్లకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతిపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదేషావలి, రైతు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ మామిడిని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

జిల్లా ఎస్పీగంగాధర్‌రావ్

కలకడ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశించారు. ఆదివారం కలకడ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. కేసులలో ప్రత్యేక శ్రద్ధ చూపి నిందితులను పట్టుకోవడం, దాడులకు పాల్పడ్డవారిని అరెస్టు చేయాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రౌడీ షీటర్లును గుర్తించడం, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తల చిరునామాలు నమోదు చేయాలని ఆదేశించారు. పట్టణాలలో సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో శాంతియుతంగా ఉండే విదంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పోలీస్ సిబ్బంది ఉత్తమ సేవలకు గుర్తించి సిబ్బందికి అవార్డులు, సత్కారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, సీఐలు నాగేంద్ర, మహబూబ్‌అలీ, ఎస్ఐ తిప్పేస్వామి, ఏఎస్ఐలు పాల్గొన్నారు.



కలకడలో పోలీస్ వ్యాపార సముదాయాలను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావ్

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వాల్మీకిపురం: అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఇందిరమ్మకాలనీలో మహిళలకు వంట గ్యాస్, ఫైర్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సురక్షితంగా తప్పించుకునే మార్గాలు తెలిపి, విధానాలు చేసి చూపించారు. విపత్కర సమయంలో ధైర్యంగా ఉండాలని, సమస్యల నుంచి బయట పడేందుకు ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బాబయ్య, శ్రీనివాసులు, రాజగోపాల్, కిరణ్‌బాబు, రవి, ఇమ్రాన్ బాష, చైతన్య, భాస్కర్, శివశంకర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : వంట గదుల్లో మహిళలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక కేంద్ర అధికారి పి. అనీల్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక దుర్గా గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయన్నారు. మహిళలు వంట గదుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా నివారించాలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు, దుర్గాగ్యాస్ అధినేత అమరేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

పార్టీ అభివృద్ధికి సైనికుల్లా పని చేయండి

వాల్మీకిపురం: పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గండబోయనపల్లిలో హరీష్ రెడ్డి అతిథి గృహంలో యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రత్నశేఖర్ రెడ్డి అనిల్, శ్యామ్, ముబారక్, రమణ, రాయుడు, శీనా పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లోని కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు.

మిట్స్ విద్యార్థి అంతర్జాతీయ ప్రతిభ



నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రంతో విశ్వనాథ్

కురబలకోట: అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం. విశ్వనాథ్ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ ఆదివారం తెలిపారు. బోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌లో ఇతను ఆటోమోటివ్ సెల్ఫ్ డ్రైవింగ్ కార్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్‌ను ప్రదర్శించారు. ఇది అంతర్జాతీయ స్థాయిలో మూడో బహుమతికి ఎంపికైంది. ఉత్తమ ప్రతిభకుగాను నిర్వాహకులు రూ.50 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేసినట్లు తెలిపారు. విద్యార్థి విశ్వనాథ్‌ను కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ కీలక డైరెక్టర్ కీర్తి నాదేళ్ల ప్రశంసించారు.

19న ప్రైవేట్ బస్టాండ్ వేలం

బి.కొత్తకోట: నగర పంచాయతీ పరిధిలో ప్రైవేట్ బస్టాండ్ గుత్త అప్పగించేందుకు ఈనెల 19న బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పలసాని నరసింహప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటదారులు రూ.3లక్షల డిపాజిట్ డీడీ లేదా రూ.3.50 లక్షల సాల్వేన్సీ సర్టిఫికెట్ సమర్పించి పాటలో పాల్గొనాలని కోరారు. రుసుము వసూలుకు ఏడాది పాటు గుత్త అప్పగిస్తామని తెలిపారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

పీలేరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం 2020ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జుబిర్ అన్నారు. ఆదివారం స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ విధానంలో ప్రతి అంశం కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మతతత్వ కరణ ఉన్నాయని ఆరోపించారు. అన్ని విషయాల్లో కేంద్రం విపరీత జోక్యం వల్ల రాష్ట్ర హక్కులు హరించబడుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్లకు అధిక లాభం చేకూర్చే విధంగా జాతీయ విద్యావిధానంను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శివారెడ్డి, చంద్రశేఖర్, సుధాకర్‌నాయుడు, పురం వెంకటరమణ, రమణమూర్తి, భాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, అక్రంబాషా తదితరులు పాల్గొన్నారు.


దళితులకు నారాలోకేష్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న యమలా సుదర్శనం

మదనపల్లె : యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలు జిల్లాలో దళితులను అవమానపరుస్తూ, మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నారాలోకేష్ పాదయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో దళితులను ఉద్దేశించి ఏం పీకుతారు.. ఏం పొడుస్తారని, ఏం చేస్తారని సవాల్ విసరడం దళిత సమూహాన్ని అవమానపరచడం, లక్షలాది దళితుల మనోభావాల్ని దెబ్బతీయడమేనన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు గుండామనోహర్, మల్లెలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి



నివాళులర్పిస్తున్న జేవీవీ అధ్యక్షుడు, విద్యార్థులు

వాల్మీకిపురం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుచరణ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు తెలుగు పండితుడిగా పని చేసి తెలుగుబాషా వికాసానికి ఎనలేని కృషి చేశారన్నారు. అలాగే 130కి పైగా గ్రంథాలు, 1903పైగా వ్యాసాలు రాశారన్నారు. ఆయన కృషితో 1881 డిసెంబర్ 11న రాజమండ్రిలో మొదటి వితంతు వివాహం జరిపించడంతో పాటు సుమారు 40 వితంతు పునర్వివాహాలు జరిపించారన్నారు. ప్రధానోపాధ్యాయుడు అమరనాథ రెడ్డి, ఉపాధ్యాయులు నాగేశ్వర, చెంగయ్య, నాగరాజ, తారాదేవి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.